పాఠశాలలో విచారణ చేస్తున్న గురుకుల సెక్రటరీ సీతాలక్ష్మి

ఇమాంపేట గురుకుల పాఠశాలలో కలకలం

- వారం రోజుల్లో ఇద్దరు విద్యార్థినుల ఆత్మహత్య
- ఆందోళనలో విద్యార్థులు, తల్లిదండ్రులు
- ఇప్పటికే ప్రిన్సిపాల్ సస్పెన్షన్
- వరుస ఘటనలపై అధికారుల ఆరా
- పాఠశాలలో ఏం జరుగుతున్నది : ఎమ్మెల్సీ కవిత

అస్మిత(ఫైల్)

సూర్యాపేట రూరల్/మోతె, ఫిబ్రవరి 18 : సూర్యాపేట మండలం ఇమాంపేటలోని సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలకు చెందిన మరో విద్యార్థిని శనివారం ఆత్మహత్య చేసుకోవడం ఆందోళన కలిగిస్తున్నది. ఇటీవల అదే పాఠశాలకు చెందిన ఇంటర్మీడియట్ రెండో సంవత్సరం బైపీసీ చదువుతున్న విద్యార్థిని డి. వైష్ణవి కళాశాలలో ఫేర్‌వెల్ పార్టీ జరిగిన సాయంత్రం ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకుంది. దీనిపై విద్యార్థిని బంధువులు, విద్యార్థి సంఘాలు, ప్రజా సంఘాలు రాస్తారోకో, ధర్నాలు చేయడంతో అధికారులు గురుకుల కళాశాల ప్రిన్సిపాల్ గత శుక్రవారం సస్పెండ్ చేశారు. ఆ సంఘటన మరువకముందే తాజాగా అదే గురుకుల పాఠశాలకు చెందిన పదో తరగతి విద్యార్థిని ఇరుగు అస్మిత(15)శనివారం ఆత్మహత్య చేసుకుంది. సూర్యాపేట జిల్లా మోతె మండలం బుర్కచర్ల గ్రామానికి చెందిన ఇరుగు ఆనంద్, జ్యోతి దంపతులకు ఒక్క కుమార్తె అస్మిత. ఈ నెల 10న ఇంటర్మీడియట్ విద్యార్థిని వైష్ణవి మృతి చెందడంతో విద్యార్థులు భయపడకుండా ఉండటానికి పాఠశాల, కళాశాలకు 4రోజులు (హోంసిక్) సెలవులు ప్రకటించారు. అస్మిత తండ్రి చనిపోవడంతో అస్మిత తల్లి కూలి పనులు చేసుకుంటూ హైదరాబాద్‌లో ఉంటున్నది. పాఠశాలకు సెలవులు ప్రకటించడంతో అస్మిత హైదరాబాద్‌కు వెళ్లింది. శనివారంతో సెలవులు అయిపోతున్నందున పాఠశాలకు వెళ్దామని చెప్పిన అస్మిత తల్లి తన పనులకు వెళ్లి తిరిగి వచ్చే సరికి ఇంట్లోని ఫ్యాన్‌కు చున్నీతో ఉరివేసుకుంది. పాఠశాలకు వెళ్లాల్సిన రోజే అస్మిత ఉరివేసుకోవడం మిస్టరీగా మారింది. ఇటీవల ఆత్మహత్య చేసుకున్న వైష్ణవి రూమ్‌లోనే అస్మిత కూడా ఉంటుందని సమాచారం. వైష్ణవి మృతి చెందడంతో అస్మిత డిప్రెషన్‌కు గురైనట్లు సమాచారం. పాఠశాలకు వెళ్లాల్సి వస్తుందని అస్మిత అప్పటికప్పుడు చనిపోవాలని నిర్ణయించుకుందా, అంతకుముందే డిసైడ్ అయ్యిందా అన్న కోణంలో పలువురు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. వారం వ్యవధిలోనే ఇద్దరు విద్యార్థినులు ఆత్మహత్యకు పాల్పడటం విద్యార్థినులు, తల్లిదండ్రుల్లో ఆందోళన మొదలైంది. అస్మిత మృతదేహాన్ని హైదరాబాద్ నుంచి ఆదివారం సొంత గ్రామం బుర్కచర్లకు తీసుకొచ్చి అంత్యక్రియలు నిర్వహించారు. అంతకుముందు సూర్యాపేట జిల్లా కేంద్ర దవాఖానలో పోస్టుమార్టం చేశారు. తల్లి జ్యోతి ఫిర్యాదు మేరకు మోతె ఎస్ఐ యాదవేందర్ రెడ్డి కేసు నమోదు చేశారు. మునగాల సీఐ రామకృష్ణారెడ్డితోపాటు అధికారులు కేసు విచారణ చేపడుతున్నారు.

గురుకుల పాఠశాలను సందర్శించిన సెక్రటరీ

ఇమాంపేట బాలికల గురుకుల పాఠశాలలో జరిగిన సంఘటనలను తెలుసుకునేందుకు ఆదివారం సాయంత్రం సోషల్ వెల్ఫేర్ గురుకుల సెక్రటరీ సీతాలక్ష్మి సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాలలోని తరగతి గదులు, భోజనశాల, బాలికల విశ్రాంతి గదులను అధికారులతో కలిసి పరిశీలించారు. పాఠశాలలో పనిచేస్తున్న సిబ్బందితో మాట్లాడి వివరాలను తెలుసుకున్నారు. విద్యార్థుల్లో మానసిక ధైర్యం నింపాలని, చదువుతోపాటు పిల్లలతో మమేకమై ఆటపాటలతో ఆనందింపజేయాలని ఉపాధ్యాయులకు సూచించారు. విద్యార్థుల్లో మానసిక ధైర్యం పెంపొందించేందుకు సైక్రియాట్రిస్టులతో కమిటీ ఏర్పాటు చేశామని, డాక్టర్ అనిల్, సరస్వతి, జ్యోతి పద్మ, ఉమామహేశ్వరి విద్యార్థులకు కౌన్సెలింగ్ ఇస్తారని తెలిపారు. ఆమె వెంట జాయింట్ సెక్రటరీ అనంతలక్ష్మి, నల్లగొండ రీజినల్ కోఆర్డినేటర్ ప్రశాంతి, ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ అరుణకుమారి, అధ్యాపకులు హైమావతి, రమాకుమారి, శ్రీలత ఉన్నారు.

ప్రభుత్వం విచారణ చేపట్టాలి : ఎమ్మెల్సీ కవిత

ఇమాంపేట ఎస్సీ బాలికల గురుకుల పాఠశాలకు చెందిన మరో విద్యార్థిని ఆత్మహత్య చేసుకోవడం బాధాకరమని, ఒకే పాఠశాలకు చెందిన ఇద్దరు విద్యార్థినులు కొద్దికాలం వ్యవధిలోనే ఆత్మహత్య చేసుకోవడం దురదృష్టకరమని ఎమ్మెల్సీ కవిత ట్విట్టర్ వేదిక ద్వారా ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణ సాంఘిక సంక్షేమ పాఠశాలల్లో అసలు ఏం జరుగుతున్నది.. విద్యార్థులు ఎందుకు ఇలా వరుస ఆత్మహత్యలు చేసుకుంటున్నారో ప్రభుత్వం విచారణ చేపట్టాలని కోరారు. పూర్తి స్థాయిలో సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి లేకపోవడంతో ఇలాంటి అనేక సమస్యలను ప్రభుత్వం పట్టించుకోలేకపోతున్నదని పేర్కొన్నారు. పూర్తిస్థాయి సంక్షేమ శాఖ మంత్రి నియమించడంతోపాటు విద్యార్థులకు కౌన్సిలింగ్ ఇచ్చే దిశగా ప్రభుత్వం ఆలోచన చేయాలని విజ్ఞప్తి చేశారు.

పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

కొనసాగుతున్న మహా సౌరయాగం

మేళ్లచెర్వు, ఫిబ్రవరి 18 : మాతా చారిటబుల్ ట్రస్ట్ కొంకపాక రాధాకృష్ణమూర్తి-సీతాకుమారి ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని భూనీలా సమేత వెంకటేశ్వరస్వామి ఆలయంలో మహా సౌరయాగం ఆదివారం తొమ్మిదో రోజుకు చేరింది. ఈ సందర్భంగా ద్వాదశావరణ పూజలు, సూర్య నమస్కారాలు, అరుణ పారాయణ పూజలను అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. లోక కల్యాణం కోరుతూ నిర్వహిస్తున్న ఈ యాగం మార్చి 10 వరకు జరుగనున్నది. కార్యక్రమంలో అర్చకులు యాతవాకిళ్ల భానుకిరణ్ శర్మ, సాయిశర్మతోపాటు భక్తులు పాల్గొన్నారు.

ఉండ్రుగొండలో పవిత్రోత్సవాలు పరిపూర్ణం

ఉండ్రుగొండ లక్ష్మీనరసింహ ఆలయంలో హోమం నిర్వహిస్తున్న అర్చకులు

చివ్వెంల, ఫిబ్రవరి 18 : మండల పరిధిలోని గిరిదుర్గంలో వెలసిన ఉండ్రుగొండ లక్ష్మీనరసింహ ఆలయంలో మూడు రోజులుగా జరుగుతున్న పవిత్రోత్సవాలు ఆదివారం ముగిశాయి. ఈ సందర్భంగా రుత్వికులు ఆరుట్ల రవి కుమారాచార్యులు, అరవిందాచార్యులు మహాపూర్ణాహుతి, పవిత్రావరోహణం, నవకలశస్నపనం, కుంభ ప్రోక్షణ జరిపించారు.

ఉమ్మడి జిల్లా నుంచే కాకుండా హైదరాబాద్, వరంగల్, ఆంధ్ర ప్రదేశ్‌లోని గుంటూరు, విజయవాడ నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని పూజలు చేశారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

కోదాడలో దొంగల హల్‌చల్

- తాళం వేసిన ఇండ్లే టార్గెట్
- గుడిబండలో అర్ధరాత్రి సంచరించిన గుర్తుతెలియని వ్యక్తులు
- ఆందోళనలో పట్టణ ప్రజలు

గుడిబండలో అర్ధరాత్రి సంచరిస్తున్న అనుమానితులు

కోదాడ రూరల్, ఫిబ్రవరి18 : కోదాడ పట్టణం, పరిసర ప్రాంతంలో దొంగల హల్‌చల్‌తో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. అర్ధరాత్రి తాళంవేసిన ఇండ్లను టార్గెట్ చేస్తూ చోరీలకు పాల్పడుతున్నారు. ఈ నెల 16న కోదాడ పట్టణ పరిధి గోపిరెడ్డినగర్‌లో అర్ధరాత్రి ఐదు ఇండ్లలో చోరీకి పాల్పడ్డారు. ప్రసాద్ ఇంట్లో 5 తులాల బంగారం, 70 వేల నగదు అపహరించుకెళ్లారు. పరిసర ప్రాంత సీసీ కెమెరాలను పరిశీలించగా ముగ్గురు వ్యక్తులు మాస్కులు ధరించి ఇనుపరాడ్లతో సంచరిస్తున్న ఫుటేజీలు కనిపించినట్లు కాలనీ వాసులు తెలిపారు. అలాగే మండల పరిధి గుడిబండలో శనివారం అర్ధరాత్రి గుర్తుతెలియని అనుమానితులు సంచరించినట్లు గ్రామంలోని సీసీ కెమెరాల్లో నమోదైనట్లు తెలిపారు. ఈ నెల 10న పట్టణ శివారులోని గుడిబండ-మేళ్లచెర్వు ప్రధాన రహదారిపై దొరకుంట గ్రామానికి చెందిన వ్యక్తి తన బైకును రోడ్డు పక్కన నిలిపి ఫోను మాట్లాడుతుండగా గుర్తుతెలియని దుండగులు వెనుక నుంచి వచ్చి ముఖంపై క్లాత్ కప్పి సెల్‌ఫోన్, నగదు లాక్కొని పారిపోయినట్లు పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఇప్పటికైనా పోలీసులు పహారా పెంచి దొంగతనాలను అరికట్టాలని ప్రజలు కోరుతున్నారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి : సీఐ రాము

సీసీ ఫుటేజీల ఆధారంగా దొంగలను అరెస్టు చేసేందుకు తమ సిబ్బంది ముమ్మరంగా గాలిస్తున్నది. ప్రజలు ఆందోళన చెందకుండా అప్రమత్తంగా ఉండాలి. ప్రతి కాలనీలో సీసీ కెమెరాలె ఏర్పాటు చేసుకోవాలి. ఎవరైనా దూరప్రాంతాలకు వెళ్లిన సమయంలో ఇంట్లో విలువైన వస్తువులు ఉంచరాదు. అనుమానితులు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలి.

ఆధ్యాత్మిక చింతన అలవర్చుకోవాలి

- తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్

చిల్పకుంట్లలో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే మందుల సామేల్

నూతనకల్, ఫిబ్రవరి 18 : ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక చింతన అలవర్చుకోవాలని తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్ అన్నారు. ఆదివారం మండలంలోని చిల్పకుంట్లలో నిర్వహించిన బొడ్రాయి తృతీయ వార్షికోత్సవంలో ఆయన పాల్గొని పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామాల్లో ప్రజలు ఐక్యమత్యంగా ఉంటూ ఆధ్యాత్మిక కార్యక్రమాలు చేపట్టడం అభినందనీయమని పేర్కొన్నారు. దైవచింతనతో మానసిక ప్రశాంతత కలుగుతుందని అన్నారు. ప్రజలంతా సుఖఃసంతోషాలతో వర్ధిల్లాలని కోరారు. కార్యక్రమంలో నాగం సుధాకర్‌రెడ్డి, కొంపెల్లి మల్లారెడ్డి, బాణాల సుదర్శన్‌రెడ్డి, పన్నాల రమామల్లారెడ్డి, తీగల గిరిధర్‌రెడ్డి, బత్తుల నాగమల్లు, బాణాల సత్యనారాయణరెడ్డి, దరిపెల్లి వీరన్న, కళ్లెం కృష్ణారెడ్డి, పసుల అశోక్, కురివి గంగయ్య, మేడిపల్లి అశోక్ పాల్గొన్నారు.

దోషులను శిక్షించాలి

– ఏఐఎస్ఎఫ్ జిల్లా నాయకుడు వెంకట్

నేరేడుచర్ల, ఫిబ్రవరి 18 : ఇమాంపేట ఎస్సీ గురుకుల పాఠశాలలో విద్యార్థినుల ఆత్మహత్యకు కారణమైన దోషులను కఠినంగా శిక్షించాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా నాయకుడు కొమర్రాజు వెంకట్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక విలేకరులతో ఆయన మాట్లాడుతూ విద్యార్థినుల ఆత్మహత్యలకు కారణాలను గుర్తించడం కోసం విద్యాశాఖ ప్రత్యేక బృందం ఏర్పాటు చేయాలన్నారు. విద్యార్థులకు మానసిక తరగుతులు నిర్వహించాలని కోరారు. విద్యార్థుల కుటుంబాలకు రూ.25లక్షల ఎక్స్‌గ్రేషియా ప్రకటించాలని డిమాండ్ చేశారు.

చౌటపల్లిలో వైద్య శిబిరం

మఠంపల్లి, ఫిబ్రవరి 18 : మండలంలోని చౌటపల్లిలో మేళ్లచెర్వుకు చెందిన మైహోం సిమెంట్స్ ప్రైవేట్ లిమిటెడ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని పరిశ్రమ ప్రెసిడెంట్, యూనిట్ హెడ్ శ్రీనివాసరావు ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీలో భాగంగా వైద్య శిబిరం నిర్వహించి రక్త పోటు, మధుమేహం, గుండె, మూత్ర పిండాలు, స్త్రీలు, చిన్న పిల్లలకు సంబంధించిన వ్యాధులకు ఉచితంగా పరీక్షలు చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ అశోక్ కుమార్, డాక్టర్ సౌజన్య, డాక్టర్ పార్థ, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

కుల గణన ప్రకటన హర్షణీయం : శ్రీనివాస్

తిరుమలగిరి, ఫిబ్రవరి 18 : రాష్ట్ర ప్రభుత్వం కుల గణన చేపడుతామని ప్రకటించటం హర్షణీయమని తెలంగాణ మంగళి మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు చిక్కుల్ల పల్లి శ్రీనివాస్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో ఆయన మాట్లాడుతూ కుల గణనతో సామాజిక కులాల లెక్క తేలుతుందని పేర్కొన్నారు. అన్ని కులాల గణనతో ఆయా కులాల జనాభా దామాషా ప్రకారం ప్రాధాన్యత పెరుగుతుందని అన్నారు. అన్ని కులాలు రాజకీయంగా, సామాజికంగా ఎదుగాలంటే కుల గణనతోపాటు చట్టసభల్లో కూడా అవకాశాలు కల్పించాలని కోరారు. సమావేశంలో మహేశ్, ఉపేందర్ పాల్గొన్నారు.

21 వరకు ఓపెన్ టెన్త్ ఫీజు గడువు

నూతనకల్, ఫిబ్రవరి 18 : తెలంగాణ ఓపెన్ స్కూల్ సొసైటీ ఆధ్వర్యంలో పదో తరగతి, ఇంటర్మీడియట్ పరీక్షలు రాయబోయే అభ్యర్థులు తమ పరీక్షల ఫీజుల చెల్లింపునకు అపరాధ రుసుముతో ఈ నెల 21 వరకు గడువు పొడిగించినట్లు నూతనకల్ జడ్పీ హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు రాములు నాయక్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. పదో తరగతి విద్యార్థులకు సబ్జెక్టుకు రూ.100, ఇంటర్ విద్యార్థులకు సబ్జెక్టుకు రూ.150 చెల్లించాలని తెలిపారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

మ్యాట్‌పై కబడ్డీ ఆడుతున్న క్రీడాకారులు

హోరాహోరీగా రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలు

చింతలపాలెం, ఫిబ్రవరి 18 : మండల కేంద్రంలో నిర్వహిస్తున్న రాష్ట్రస్థాయి సబ్ జూనియర్ అండర్-16 బాలబాలికల కబడ్డీ పోటీలు హోరాహోరీగా కొనసాగుతున్నాయి. ఈ పోటీలను తిలకించేందుకు పరిసర ప్రాంతాల ప్రజలు ఆసక్తి చూపుతున్నారు. పలు జిల్లాల నుంచి బాల బాలికల జట్లు పాల్గొన్నాయి. క్రీడాకారులకు నిర్వహణ కమిటీ ఆధ్వర్యంలో అన్ని వసతులు కల్పించారు. కార్యక్రమంలో రాష్ట్ర, జిల్లాస్థాయి కబడ్డీ అసోసియేషన్ల సభ్యులు, నిర్వాహకులు పాల్గొన్నారు.

హనుమాన్ చాలీసాలో పాల్గొన్న భక్తులు

గడపగడపకూ హనుమాన్ చాలీసా

కోదాడ టౌన్, ఫిబ్రవరి 18 : కోదాడ పట్టణంలో నిర్మిస్తున్న కోదండ రామాలయ పునఃప్రతిష్ఠ కార్యక్రమంలో ప్రజలంతా భాగస్వాములు కావాలని కాంక్షిస్తూ నాగుబండి నళిని ఆధ్వర్యంలో గడప గడపకూ హనుమాన్ చాలీసా కార్యక్రమాన్ని చేపట్టారు. ఆదివారం నయానగర్‌లో సీతారామచంద్రస్వామి చిత్రపటాల ఊరేగింపు నిర్వహించారు. నయానగర్‌లో దేవరపల్లి మల్లేశ్వరి, నాగిరెడ్డి సహకారంతో 108 గడపలకు హనుమాన్ చాలీసా కార్యక్రమాన్ని విజయవంతంగా పూర్తి చేశారు. కౌన్సిలర్ చందర్‌రావు, కృష్ణయ్య, అన్నపూర్ణ, సౌమ్య, సుభద్ర, లక్ష్మి, సంధ్య, అనంతమ్మ, భక్తులు పాల్గొన్నారు.

నాటిన మొక్కలను సంరక్షించాలి

- సర్పంచ్‌ల ఫోరం మాజీ మండలాధ్యక్షుడు లింగారెడ్డి

మునగాల, ఫిబ్రవరి 18 : హరితహారంలో భాగంగా నాటిన మొక్కలతోపాటు తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా సంపద వనాల్లో నాటిన మొక్కలను సంరక్షించాలని సర్పంచ్‌ల ఫోరం మాజీ మండలాధ్యక్షుడు వీరంరెడ్డి లింగారెడ్డి ప్రభుత్వాన్ని కోరారు.

ఆదివారం మండల పరిధిలోని కృష్ణానగర్‌లో నాటిన మొక్కలను ఆయన పరిశీలించి మాట్లాడారు. సర్పంచ్‌ల పదవీకాలంలో కాపాడిన మొక్కలను ఇప్పుడు ప్రత్యేకాధికారుల పాలనలో కూడా కాపాడాలని కోరారు. ఆయన వెంట గ్రామస్తులు, బీఆర్ఎస్ నాయకులు ఉన్నారు.

బాధిత కుటుంబానికి బియ్యం అందజేత

తుంగతుర్తి, ఫిబ్రవరి 18 : మండల కేంద్రానికి చెందిన రామడుగు భాస్కరాచారి మాతృమూర్తి లక్ష్మమ్మ అనారోగ్యంతో మృతి చెందింది. ఆమె కుటుంబానికి జిల్లా కాంగ్రెస్ నాయకుడు పెండెం రామ్మూర్తి సానుభూతి తెలిపి 50 కిలోల బియ్యం అందజేశారు.

కార్యక్రమంలో కాంగ్రెస్ మండల నాయకులు కొండ రాజు, మాచర్ల అనిల్, అబ్దుల్, అక్కినపల్లి నరేశ్, రాములు, హుస్సేన్, మస్తాన్, రంజిత్, రమేశ్, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులతో పూర్వ విద్యార్థులు

ఘనంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం

ఆత్మకూర్.ఎస్, ఫిబ్రవరి 18 : మండలంలోని ఏపూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2011-12లో పదో తరగతి చదివిన విద్యార్థులు ఆదివారం అశ్వక్ ఫంక్షన్ హాల్‌లో పూర్వ విద్యార్థుల సమ్మేళనాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తమతోపాటు చదువుకుని మరణించిన విద్యార్థులకు సంతాపం తెలిపారు. నాటి జ్ఞాపకాలను గుర్తుచేసుకుంటూ సంతోషంగా గడిపారు. అనంతరం ఉపాధ్యాయులను సన్మానించారు.

కార్యక్రమంలో ఉపాధ్యాయులు వెంకటయ్య, వీరారెడ్డి, వెంకట్‌రాంరెడ్డి, వెంకన్న, శ్రీనివాసచారి, దయాకర్, సైదులు, విద్యార్థులు సైదులు, సతీష్, నాగరాజు, మహేశ్, శివ, ఉపేందర్, మౌనిక, సరస్వతి, శ్రీలత, అనిత, సరిత, సంధ్య, పావని తదితరులు పాల్గొన్నారు.

శేష వాహనంపై రామ లింగేశ్వరుడు

- కనుల పండువగా చెర్వుగట్టు బ్రహ్మోత్సవాలు
- నేడు అగ్నిగుండాలు

చెర్వుగట్టులో శేష వాహనంపై ఊరేగుతున్న రామలింగేశ్వర స్వామి

నార్కట్‌పల్లి, ఫిబ్రవరి 18 : చెర్వుగట్టు పార్వతీ జడల రామలింగేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు కనుల పండువగా కొనసాగుతున్నాయి. ఆదివారం తెల్లవారుజామున శేష వాహనంపై స్వామి వారి సేవా కార్యక్రమాలను ప్రధాన అర్చకులు పోతులపాటి రామలింగేశ్వర శర్మ అంగరంగ వైభవంగా నిర్వహించారు. సూర్య నమస్కారాలు, దీక్షా హోమాలు, రుద్రహోమం, బలిహరణ, సందస్యం వేద స్వస్తి, సరస్వతీ పూజ, మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, మహా నివేదన, నీరాజన మంత్రపుష్పం నిర్వహించారు. ఆంజనేయ స్వామికి లక్ష తమలపాకులతో ప్రత్యేక పూజలు చేపట్టారు. దేవాలయ అసిస్టెంట్ కమిషనర్ మహేంద్ర కుమార్, ఇన్‌చార్జి ఈఓ నవీన్, డీఎస్పీ శివరాంరెడ్డి పర్యవేక్షణలో భక్తులకు ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకుంటున్నారు.

తెల్లవారుజామున అగ్ని గుండాలు

బ్రహ్మోత్సవాలలో భాగంగా సోమవారం తెల్లవారుజామున స్వామి వారి అగ్ని గుండాలు, పర్వత వాహన సేవను ఘనంగా నిర్వహించనున్నారు. అగ్ని గుండంలో రైతులు పండించిన ఆముదాలు, కందులు, ఇతర ధాన్యాలు వేసి మొక్కు చెల్లించుకుంటారు. అర్ధరాత్రే గుట్టపైకి భక్తులు పెద్ద సంఖ్యలో చేరుకోగా కణకణలాడే నిప్పులపై నడుచుకుంటూ వెళ్లనున్నారు.

అవార్డు అందుకుంటున్న తండు హరికృష్ణ

హరికృష్ణకు పెన్స్ ఆఫ్ హానర్ అవార్డు

హుజూర్‌నగర్, ఫిబ్రవరి 18 : డయాగ్నస్టిక్స్‌కు సంబంధించి ఎక్విప్‌మెంట్స్ వాటి పనితీరు, ల్యాబ్ మెషినరీ క్వాలిటీ కంట్రోల్స్ ద్వారా రక్త పరీక్షల్లో వచ్చే కచ్చితత్వం గురించి తెలియజేసే 'ఎవాల్యుయేటింగ్ ప్యాక్టర్స్ ఎఫెక్టింగ్ యూజ్ ఆఫ్ మెడికల్ డయాగ్నస్టిక్స్ ఎక్విప్‌మెంట్స్' అనే పుస్తకాన్ని రచించినందుకు గానూ హుజూర్‌నగర్‌కు చెందిన తండు హరికృష్ణ అవార్డు అందుకున్నారు. హైదరబాద్‌కు చెందిన ప్రశాస్ పబ్లికేషన్ వారు పెన్స్ ఆఫ్ హానర్ అనే అవార్డును ఆదివారం ఆయనకు ప్రదానం చేశారు. త్వరలో ఈ పుస్తకాన్ని అమెజాన్, ఫ్లిప్‌కార్ట్‌లో రిలీజ్ చేయనున్నట్లు హరికృష్ణ తెలిపారు.

భక్తిశ్రద్ధలతో బొడ్రాయి ప్రతిష్ఠ వేడుకలు

చింతలపాలెం, ఫిబ్రవరి 18 : మండలంలోని నక్కగూడెంలో ఆదివారం బొడ్రాయి ప్రతిష్ఠ వేడుకలను ఆదివారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అర్చకులు, పురోహితులు, పూజారులు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమంలో గ్రామస్తులు, పరిసర ప్రాంతాల ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

మఠంపల్లి : మండలంలోని బోడబండతండాలో బొడ్రాయి, ముత్యాలమ్మ మూడో వార్షికోత్సవాన్ని తండా ప్రజలు ఆదివారం ఘనంగా జరుపుకొన్నారు. ఈ సందర్భంగా బొడ్రాయి, ముత్యాలమ్మకు అభిషేకాలు, పూజలు చేశారు. కార్యక్రమంలో పీఏసీఎస్ వైస్ చైర్మన్ బాబునాయక్, సక్రూనాయక్, మంగళ్‌నాయక్, పూల్‌సింగ్, కిషన్, బాబు, హుస్సేన్ పాల్గొన్నారు.

మఠంపల్లి : పూజలు చేస్తున్న బోడబండతండావాసులు

గడ్డిపల్లి : ధ్యాన మందిరంలో పూజలు చేస్తున్న నిర్వాహకులు

చింతలపాలెం : మండల కేంద్రంలో ఉమామహేశ్వర, వీరబ్రహ్మేంద్ర, మాచదేవయ్య స్వాముల విగ్రహాలు, ధ్వజస్తంభ ప్రతిష్ఠ మహోత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించనున్నారు. ఇందుకుగానూ రెండు రోజులుగా ఆలయ కమిటీ, గ్రామస్తుల ఆధ్వర్యంలో అర్చకులు భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు. ఉత్సవానికి పరిసర ప్రాంతాల ప్రజలు పెద్దఎత్తున వచ్చి స్వామివారి తీర్థ ప్రసాదాలు స్వీకరించి వారి ఆశీస్సులు పొందాలని ఆలయ కమిటీ సభ్యులు కోరారు.

ధ్యాన మందిర ఉత్సవాలు

గరిడేపల్లి : మండలంలోని గడ్డిపల్లిలో గల అరవింద ధ్యాన మందిర 52వ వార్షికోత్సవం సందర్భంగా నాలుగు రోజులపాటు నిర్వహించనున్న ఉత్సవాలను గ్రామస్తులు ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ధ్యాన మందిరాన్ని ప్రత్యేకంగా అలంకరించి ప్రార్థనలు చేశారు. రాత్రి సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఉత్సవ నిర్వాహకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.